క్లుప్తంగా

ప్రణాళికతో చదివితే విజయం

కర్నూలు(హాస్పిటల్): ప్రణాళికా బద్ధంగా చదివితే విజయం తప్పక సిద్ధిస్తుందని సెట్కూరు సీఈవో పీవీ రమణ చెప్పారు. సెట్కూరు-యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సెయింట్ జోసఫ్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 సహకారంతో బుధవారం స్థానిక పడిదెంపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస/కెరీర్ కౌన్సిలింగ్, హ్యాపీ ఎగ్జామ్స్, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అయిన తర్వాత ఉన్నత విద్యావకాశాలు, ఏపీ కళాశాల్లో ఏఏ కోర్సులు ఉన్నాయి, అర్హత పరీక్షలు, కర్నూలు జిల్లాలో ఉన్న శిక్షణా సంస్థల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్. రాజశేఖర్, సెట్కూరు మేనేజర్ జి. సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి కె. శ్రావణి పాల్గొన్నారు.

కవి మండ్ల జయరాం అస్తమయం

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు, కవి, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ మండ్ల జయరాం బుధవారం తెల్లవారు జామున పరమపదించారు. జయరాం కోడుమూరు మండలం ప్యాలకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పాఠశాల సహాయకులుగా విధులు నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక అస్తమించారు. ఈయన భార్య అరుణకుమారి కులుమాల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. జయరాం మృతికి సాహితీ స్రవంతి సంతాపం ప్రకటించింది. ఆయన భౌతిక కాయాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ఇతర సభ్యులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

సత్యవేద ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు అవార్డు

కర్నూలు(టౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ పట్టణ, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ నుంచి కర్నూలు సత్యవేద ఎస్‌హెచ్‌జీ గ్రూపు అవార్డు పొందింది. బుధవారం ఢిల్లీలో ఆ గ్రూపు ప్రతినిధి కృష్ణవేణి అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో మెప్మా మిషన్ సంచాలకులు విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సత్యవేద ఎస్‌హెచ్‌జీ గ్రూపు డోర్ మ్యాట్, వేస్ట్ క్లాత్‌లను తయారు చేస్తూ సంవత్సరానికి రూ.30 లక్షలు టర్నోవర్ సాధిస్తుందన్నారు. ఈ గ్రూపు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తుందన్నారు.

అందరి సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధి



సన్మానం పొందిన గ్రంథాలయాల ఉద్యోగులతో చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: అందరి సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గ్రంథాలయాల్లో ఉత్తమ సేవలు అందించిన 18వ మంది ఉద్యోగులను బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ ఉప గ్రంథాలయథపాలకులు పెద్దక్క, గ్రంథాలయ సహాయకులు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా కళక్టరేట్

- రూ.12 కోట్లతో ఆధునికీకరణ
- ప్రత్యేక డిజైన్‌తో సిద్ధమైన సునయన ఆడిటోరియం, కలెక్టరేట్ ముందు భాగం
- కలెక్టర్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తయిన పనులు
- నేడు ఆధునికీకరించిన కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించనున్న మంత్రి బుగ్గన

కర్నూలు(సెంట్రల్) : జిల్లా పరిపాలన కేంద్రం (కలెక్టరేట్) సరికొత్త శోభను సంతరించుకుంది. ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ జి.సృజన, గతంలో పని చేసిన కలెక్టర్ కోటేశ్వరరావు ప్రత్యేక చొరవతో ప్రతి విభాగం కార్యాలయం ప్రత్యేకంగా కనిపిస్తోంది. స్వచ్ఛమైన గాలి, వెలుతురుతోపాటు అవసరమైన ఫర్నీచర్, ఇతర సదుపాయాలతో చేసిన డిజైన్లు ఆకట్టుకుంటున్నాయి. రూ. 12 కోట్లతో చేపట్టిన ఈ ఆధునికీకరణ పనులు పూర్తికావడంతో నేడు జిల్లా ఇన్ చార్జ్‌మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించనున్నారు.



జిల్లా కలెక్టరేట్

సీఎం దృష్టికి తీసుకెళ్లి .. నిధులు మంజూరు చేయించి

జిల్లా కలెక్టరేట్‌ను 40 ఏళ్ల క్రితం నిర్మించారు. దీంతో చాలా భవనాలు మర్మతులకు గురయ్యాయి. కొన్ని భవనాలు పెచ్చులు ఊడి పడుతుంటే..మరికొన్ని కార్యాలయాల్లో కనీసం సున్నం వేయించలేని పరిస్థితి ఉండేది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపించేది. దీంతో కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జి.సృజన కలెక్టరేట్ పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి కలెక్టరేట్ భవనాల దుస్థితిని తీసుకెళ్లడంతోపాటు స్వయంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి వాటినిచూపించారు. పలు కార్యాలయాలు కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని మంత్రికి నివేదించారు. ముఖ్యంగా డీఈఓ కార్యాలయం, ఎస్ఆర్‌బీసీ, తదితర కార్యాలయాల పరిస్థితి దయనీయంగా ఉందని చెప్పారు. దీంతో ఆర్థిక శాఖమంత్రి వివిధ భవనాల పునర్నిర్మాణం కోసం రూ.8.08 కోట్లను మంజూరు చేశారు.

ప్రాధాన్యత క్రమంలో పనులు..

కలెక్టరేట్ భవనాన్ని ప్రాధాన్యత క్రమంలో ఆధునికీకరించేందుకు గతంలో కలెక్టర్‌గా పనిచేసిన కోటేశ్వరరావు చర్యలు తీసుకున్నారు. ఆయన హయాంలో దాదాపు రూ.4 కోట్ల వరకు ఖర్చు పెట్టారు. వీడియో కాన్ఫరెన్స్ హాలు, మినీ కాన్ఫరెన్స్ హాలు, హౌసింగ్ పీడీ, కార్యాలయం, సీపీఓ, డీఆర్వో, ఏఓ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తర్వాత కలెక్టర్‌గా సృజన కలెక్టరేట్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆర్కిటెక్ వేణుగోపాల్‌తో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఆ ప్రకారం కలెక్టర్ చాంబరు, జేసీ చాంబరు, కాన్ఫరెన్స్ హాలు, కలెక్టర్, జేసీ సీసీల కార్యాలయాలు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, డ్వామా, కలెక్టర్ కార్యాలయాల సెక్షన్లు, ట్రెజరీ, డీఈఓ కార్యాలయం, ఎస్ఎస్ఏ భవనాలు, సునయన ఆడిటోరియాలను ఆధునికీకరించారు. ఆయా భవనాల కోసం దాదాపు రూ.8.08 కోట్లను ఖర్చుచేశారు. ఇందులో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.45 లక్షలను కేటాయించారు. సునయన ఆడిటోరియాన్ని అందంగా తీర్చిదిద్దడం కోసం రూ.1.23 కోట్లను కేటాయించారు. అంతేకాక కలెక్టరేట్ ముందు భాగం,దక్షిణ భాగంలో వివిధ కార్యాలయాల ఫ్లోరింగ్, గోడలు, టాయిలెట్లు, కిటికీలు, పెయింటింగ్, అంతర్గత మరమ్మతులు, వెంటిలేటర్లకు తక్షణ మరమ్మతుల కోసం రూ.70 లక్షలు, ఉత్తర భాగం కార్యాలయాల్లో వివిధ పనులకోసం రూ.50 లక్షలు, ఎస్ఆర్‌బీసీ బ్లాక్‌లో మరమ్మతుల కోసం రూ.77 లక్షలు, వివిధ కార్యాలయాల్లో ఫ్లోరింగ్, గోడలు, టాయిలెట్లు, కిటికీలు, విండోల నిర్మాణం కోసం రూ.1.85 లక్షలు కేటాయించారు. అలాగే డీఈఓ ఆఫీసు మరమ్మతులకు 1.90 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.8.08 కోట్లతో ఈ పనులు పూర్తి చేశారు.



ఆధునికీకరించిన కలెక్టరేట్ భవనం





పూర్తి స్థాయి సౌకర్యాలతో రూపుదిద్దుకున్న కాన్ఫరెన్స్ హాల్, డీఆర్వో సెక్షన్ కార్యాలయాలు

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కలెక్టరేట్ ఆధునికీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 12 కోట్లను మంజూరు చేసింది. తన హయాంలోనే రూ.8.08 కోట్లతో వివిధ పనులు జరిగాయి. నేను కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత చేసిన మొదటి పని కార్యాలయాల ఆధునికీకరణ. ఈ పనులు పూర్తి కావడంతో సంతోషంగా ఉంది. గతంలో కలెక్టరేట్ ఉన్న పరిస్థితిని తలుచుకుంటేనే బాధగా ఉండేది. కనీస సౌకర్యాలు లేకపోయినా ఉద్యోగులు ఇబ్బందులు పడుతూ పనిచేసేవారు. అధికారులు బాధ్యతగా కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్



బి.క్యాంపులో నిర్మించిన ఆర్థిక భవనం

సిద్ధమైన ఫైనాన్స్ బిల్డింగ్

కర్నూలు(అగ్రికల్చర్): సమీకృత ఆర్థిక భవనం సర్వాంగ సుందరంగా తయారైంది. రూ.13.45 కోట్లతో నిర్మించిన ఈ భవనాన్ని నేడు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ప్రారంభించనున్నారు. బి.క్యాంపులోని సీబీడీ కార్యాలయానికి సమీపంలో అపార్టుమెంటు తరహాలో 16.50 సెంట్ల స్థలంలో (7000 చదరపు అడుగులు) జీ+3 అంతస్తులతో ఈ సమీకృత ఆర్థిక భవనాన్ని నిర్మించారు. పనులను ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ నారాయణ, డీఈ నాగరాజు, జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఫైనాన్స్ బిల్డింగ్ సిద్ధం కావడంతో ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒకే సముదాయంలోకి రానున్నాయి. బిల్డింగ్ మొదటి అంతస్తులో జిల్లా ట్రెజరీ కార్యాలయం, రెండవ అంతస్తులో సగం జిల్లా ట్రెజరీ, మరో సగం పే అండ్ అకౌంట్స్, మూడవ అంతస్తులో స్టేట్ ఆడిట్, ఏపీజీఎల్ఐ కార్యాలయాలు ఉంటాయి. సీ.క్యాంపు సెంటరులో ఉన్న కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయం కూడా ఫైనాన్స్ బిల్డింగ్‌లోకి వెళ్లనుంది. నేడు సమీకృత ఆర్థిక భవనం ప్రారంభోత్సవ నేపథ్యంలో కర్నూలుకు పలువురు ఉన్నతాధికారులు రానున్నట్లు ఏపీఈడబ్ల్యూడీసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎం.లక్ష్మినారాయణ తెలిపారు.

ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు

- వివిధ అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న కర్నూలు మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ పరిధిలోని 17 వ వార్డు ఆదిత్య నగర్‌లో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాలు, 15 వ వార్డు పరిధిలోని బుధవార పేటలో రూ.30 లక్షలతో ఫిష్ పాండ్‌లో స్థానిక ప్రజల కోసం ప్లే ఏరియా, లైటింగ్ తదితర వాటికి సంబంధించిన నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో కర్నూలు నగరం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఎక్కడ పడితే అక్కడ దిబ్బలు, పందులు, ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దామన్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం కొత్తగా ముద్రించిన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేధార్ నాథ్, వార్డు ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తా



ఎస్వీ, ఇంతియాజ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : సుదీర్ఘ పరిపాలన అనుభవంతో కర్నూలు నగర అభివృద్ధి, మైనార్టీల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక అశోక్‌నగర్ పాలకొట్టాల మదీనా మసీద్‌లో ముస్లింల ప్రార్థనల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు తెలియజేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యావేత్త, ఐఏఎస్ హోదాలో పనిచేసిన ఇంతియాజ్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి నాబార్డు చేయూత

కర్నూలు(అగ్రికల్చర్): మహిళలు అన్ని రంగాల్లో రాణించడం కోసం నాబార్డు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో పంచలింగాలలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఎల్‌డీఎం రామచంద్రరావు మాట్లాడుతూ... మహిళల అభ్యున్నతికి నేడు బ్యాంకులు అన్ని విధాలుగా సహకరిస్తున్నాయని తెలిపారు. అనంతరం రైతుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్న బ్యాంకు అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ విజయకుమార్, జనరల్ మేనేజర్ రామాంజనేయులు, ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ జిల్లా మేనేజర్ నహిదా సుల్తాన, ప్రిన్సిపాల్ స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయాలి

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని హరిజనవాడ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని, డోర్ టు డోర్ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ టీకాల కోసం వచ్చిన తల్లులకు టీకాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరఫ్‌లను పంపిణీ చేశారు. టీకాలు వేసిన వివరాలను ఆర్‌సీహెచ్, యువిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు వారి గృహసందర్శనాల్లో హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ విజిట్స్ చేయాలన్నారు. ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరఫ్‌లను పిల్లలకు ఇచ్చి ఆ వివరాలను ఈ-ఆశ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని తల్లులకు సూ చించారు. ఈ నాలుగు రోజుల్లో వందశాతం పిల్లలకు టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, డీసీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివ రాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం ఈఓ, సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షుడు ప్యాలకుర్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాలమ్మ సత్రంలోని ఆలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని, గట్టుపైకి ఏపీఎస్ ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారన్నారు. సమావేశంలో సమితి కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, సభ్యులు మురళి, మహేష్, దామోదర్ రెడ్డి, ఆదిత్య పాఠశాల అధినేత వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరామిరెడ్డి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ సీఐ పి.గౌతమి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం తాగి కర్నూలుకు వస్తున్న వాహనదారులను తనిఖీ చేయగా 12 మంది తనిఖీల్లో పట్టుబడ్డారు. అందులో మోతాదుకు మించి ముగ్గురు మద్యం తాగినట్లు గుర్తించి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ఆసుపత్రిలో రోగి చెవి కమ్మలు చోరీ

కర్నూలు : అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ చీఫ్ మేనేజర్ రామ్మోహన్ రావు సతీమణి వసంతలక్ష్మి చెవిలో వజ్రాలు పొదిగిన కమ్మలు చోరీకి గురయ్యాయి. వసంతలక్ష్మిని ఫిబ్రవరి 15వ తేదీన కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న మెడికవర్ హాస్పిటల్‌లో అత్యవసర చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స జరిగే సమయంలో వసంతలక్ష్మిని జనరల్ వార్డు నుంచి ఐసీయూకు తరలించే క్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఆమె చెవిలోని రూ.87 వేలు విలువ చేసే వజ్రాల చెవి కమ్మలు దొంగలించారు. దీనిపై రామ్మోహన్ రావు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు

కూల్‌డ్రింక్ ఇచ్చి..

కర్నూలు (టౌన్) : అపరిచిత వ్యక్తి ఇచ్చి కూల్‌డ్రింక్ ఇచ్చి చోరీకి పాల్పడ్డాడు. బెంగళూరు నుంచి కర్నూలుకు వస్తున్న బస్సులో ఈఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని ఆరోరానగర్‌కు చెందిన వెంకట శ్రీనివాస్ వ్యక్తిగత పనిమీద బెంగళూరుకు వెళ్లి మంగళవారం బస్సులో తిరిగి వస్తున్నాడు. అతని సీటు పక్కనే కూర్చున్న అపరిచిత వ్యక్తి పరిచయం చేసుకొని కూల్ డ్రింక్ ఇచ్చాడు. దానిని తాగిన శ్రీనివాస్ గాఢ నిద్రలో జారుకున్నాడు. కర్నూలు బస్టాండ్‌కు వచ్చి చూసే సరికి మెడలో బంగారు గోలుసు, చేతి గోల్డ్ రింగ్, సెల్‌ఫోన్, బ్యాగ్ మాయమయ్యాయి. ఇది అపరిచిత వ్యక్తి పనేనని భావించి బాధితుడు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు.

సంక్షిప్త సమాచారం

మహా క్షేత్రంగా రాంబొట్ల దేవాలయం

కర్నూలు కల్చరల్: రాంబొట్ల దేవాలయాన్ని పార్టీలకు అతీతంగా మహా క్షేత్రంగా తీర్చిదిద్దుతామని ఆర్యవైశ్య మహాసభ పూర్వ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం వాసవీ మహిళా కళాశాలలో ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులకు రూ.1.50 లక్షల చెక్‌ను జయంతి వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ కళాశాల కరస్పాండెంట్ సోమిశెట్టి వెంకట్రామయ్య, 46వ వార్డు కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, కొత్తపేట సత్యనారాయణ స్వామి గుడి చైర్మన్ కృష్ణకాంత్ శర్మ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు కల్చరల్: బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రామస్వామి, రమేష్, పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో బీజేపీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. విశ్వకర్మ యోజన పర్యవేక్షక సభ్యులుగా నియమితులైన కాళింగి నరసింహ వర్మ, మలేకర్ శ్రీనివాసులు, కాశీవిశ్వనాథ్, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమించ బడిన వెంకట హరి, మద్దిలేటి యాదవ్, ప్రసాద్, మోహన్, అన్వర్, జాతీయ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ సోమశేఖర్ రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో వసతులు కల్పించాలి

కర్నూలు(సెంట్రల్) : పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని పాణ్యం నియోజకవర్గ అధికారి/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డిమౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆమె పాణ్యం నియోజకవర్గ ఏఈఆర్‌ఓలు, సెక్టార్, పోలీసు సెక్టారు అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ భావన, ఓర్వకల్ తహసీల్దార్ నటరాజు, కల్లూరు తహసీల్దారు మునివేలు పాల్గొన్నారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా చిన్నరామంజనేయులు

కర్నూలు(సెంట్రల్): ఏపీ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా బి.చిన్నరామాంజనేయులును నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ యన కర్నూలు జిల్లాకు సంబంధించి అధికార ప్రతినిధిగా ఉంటారు.

అకడమిక్ క్యాలెండర్ అమలు తప్పనిసరి

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు ఖచ్చితంగా అకడమిక్ క్యాలెండర్ 2023-24ను అమలు చేయాలని డీఈఓ కాగిత శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాలెండర్ ప్రకారం పాఠశాల పని దినాలు 220 కంటే తక్కువగా ఉన్నచో ఈ నెల 9వ తేదీన పాఠశాలలు నిర్వహించాలన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: శివరాత్రికి శివాలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని సహాయ కమిషనర్ సుధాకర్ రెడ్డితో కలిసి సందర్శించా రు.అక్కడ ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో రాణించాలి

కర్నూలు (టౌన్) : మార్షల్‌ఆర్ట్స్ వంటి క్రీడల్లో మహిళలు రాణించాలని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవికా రాణి అన్నారు. బుధవారం స్థానిక ఆ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు పోటీలు నిర్వహించారు. .ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బెల్టులు ప్రదానం చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

కర్నూలు కల్చరల్: వేసవి కాలం ప్రారంభం కావడంతో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, వెంకట రమణ దీనిని ప్రారంభించి ప్రసంగించారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగులు కిడ్నీ సంబంధ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని మెడికవర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్ద్ హెరేకర్ తెలిపారు. అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గంగాధర్ రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురారి శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.